# ప్రస్థానం

మండల కేంద్రమైన ఆ ఊరు హైవేని ఆనుకుని ఉంది. ఒకే కాంపౌండులో కొత్తగా నిర్మించిన ఎమ్మార్వో ఆఫీసు, ఎమ్డీవో ఆఫీసుల ప్రారంభోత్సవం జరిగి వారం రోజులైంది.

ఎండిపోయిన మామిడాకుల తోరణాలు గాలికి ఊగుతూ గలగలమంటున్నాయి. గేటు దగ్గర్నుంచి వరసలు వరసలుగా కట్టిన గుడ్డ జెండాలు జనానికి అందకుండా ఊరిస్తున్నాయి.

అక్కడికీ అక్కడున్న జనంలోంచి సత్తివతి రెండు జెండాలన్నా చేజిక్కించుకోవాలని పొద్దుట్నుంచి ఎగిరెగిరి అందుకోడానికి ప్రయత్నిస్తానే ఉంది. "కుర్రోడికి సెడ్డీలు లేవమ్మా, రెండు జెండాలు కలిపితే ఒక సెడ్డీ అవదంటావా" అంది ప్రశ్నలోనే కారణాన్ని, సంజాయిషీని మిళితం చేసి పక్కనున్న తులసితో.

ఆ రోజక్కడ దీపం పథకం కింద గేస్ స్టవ్వులిస్తారని తెలిసి డ్వాక్రా మహిళలంతా పొద్దుటనగా చేరుకున్నారు.

కొత్త భవనంలో మొదటి మహిళా యోజన కార్యక్రమం కాబట్టి కలెక్టరుగార్ని పిలిచేరు. ఆయన గారు ఎక్కడికో అర్జెంటుగా కేంపుకెళ్లాల్సి వచ్చింది. ఆయన స్థానంలో జాయింట్ కలెక్టరుగారు వచ్చాడు.

మండలాధ్యక్షుడు స్వయంగా వెళ్లి ఆ ప్రాంతపు శాసన సభ్యుణ్ణి ఆహ్వానించి వచ్చేడు. ఏం జరిగిందో తెలీదు. పక్కనే నాలుగు కిలోమీటర్ల దూరం నుంచి ఆయనింకా లేదు. ఫోన్ చేస్తే సెల్ ఆపేసి ఉంది. మనిషిని పంపిస్తే ఇంట్లో లేడు. ఆయన రాకుండా కానిచ్చేద్దామంటే... అతగాడు అలిగేడంటే ఇంకేమైనా ఉందా? పోనీ ఆయనగారి తోకలాగా వ్యవహరించే ఛోటా నాయకుణ్ణి పట్టుకుందామంటే అయినా అయిపులేడు.

మార్చి నెల ఎండ నడినెత్తికెక్కింది. చెట్టూ చేమా లేని కాంపౌండులో ఎండ నెత్తుర్ని మాడుస్తోంది. పొద్దున్నే తలలకి కొబ్బరినూనె దట్టంగా పట్టించి కొత్తగా కొనుక్కున్న చవకరకం

పసుపు రంగు చీరల్ని కట్టుకుని కళకళలాడిపోతూ వచ్చిన డ్వాక్రా మహిళలు ఇటు ఎండ దెబ్బకీ, అటు కడుపులో పేగులు చేస్తున్న గోలకీ తట్టుకోలేక చెట్టు నుంచి కోసి పడేసిన పచ్చగన్నేరు పూలలాగా వాడి వత్తలైపోతున్నారు.

ఆ యూనిఫాం మధ్యలో బంగారమ్మొక్కత్తే తప్పి జారిపోయి వెలిసిపోయిన ఆకుపచ్చ చీరలో సన్నగా ములక్కాడలాగ కనబడుతోంది. పొట్టి వెంట్రుకల చిర్రతలకి కట్టిన గుడ్డపీలిక ఓపక్క ఊడిపోయి జుట్టు చింపిరిగా కుడి చెంప మీద పడుతోంది. నలుపు, తెలుపు కలగలిసిన వెంట్రుకలు. యాభై ఏళ్ల పైబడిన వయసులా కనిపిస్తోంది.

అప్పటికి రెండుసార్లు లోపలికి చొరబడాలని ప్రయత్నించి బంట్రోతులు గద్దించగా ఆగిపోయింది.

కారిడార్ నిండా ఉన్న పచ్చచొక్కాల వాళ్లంతా భోజనాలు చేసి రావడానికి బళ్లు, స్కూటర్లు ఎక్కి మెల్లిగా లాగించేసేరు.

అదే అదును చూసుకుని బంగారమ్మ లోపలికి చొరబడి పోయింది. తిన్నగా లోపల గదిలో ఫేన్ల కింద టేబుల్ల దగ్గర కూర్చున్న ఆఫీసర్ల గదిలోకి వెళ్లిపోయింది. వెళ్లిపోయిందన్న మాటేగాని, అక్కడ ఎవరు ఎవరో, తను ఎవరితో మాట్లాడాలో తెలీక టక్కున ఆగిపోయింది.

హఠాత్తుగా ఆమెనక్కడ చూసి ఆఫీసర్లు బిత్తరపోయేరు. మండలాధ్యక్షుడికైతే క్షణాల్లో చెమటలు పోసి చొక్కా తడిచిపోయింది. అసలే రోజులు బాగా లేవు. ఎవరు ఏ వేషంలో దాడి చేస్తారో అని ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతుకుతున్న రోజులు. ఒక్కసారిగా రాజకీయ వైరాగ్యం కమ్ముకొచ్చి 'ఛ, ఎదవ రాజకీయాలు, బతికుంటే బలుసాకు తినొచ్చు, ఈసారికి రక్షించు దేవుడా, జై బాబా, జైజై బాబా" అని మనసులోనే చెంపలేసుకోవడం ప్రారంభించేడు.

"ఎవర్రా అక్కడ, ఎక్కడ చచ్చేరు స్కౌండ్రల్స్" అని ఎప్పట్లాగా అరవాలనుకున్న ఎమ్మార్వో జాయింట్ కలెక్టరు ఎదుట బావుండదని చివరి పదాలు రెండూ మింగేశాడు.

బైట స్థిమితంగా బీడీలు కాల్చుకుంటున్న బిళ్లబంట్రోతులు ఉలిక్కిపడి ఉరుక్కుంటూ లోపలికొచ్చి పడ్డారు. రావడం రావడమే బంగారమ్మ చెరో రెక్కాపట్టుకోబోయి, ఆడవాళ్లతో వ్యవహారం ఏం ముంచుకొస్తుందోనని ఆగిపోయేరు.

"ఏయ్, ఏటీ దౌర్జన్యం? ఎవర్నువ్వు?" గద్దించేడు మండలాధ్యక్షుడు.

"అదేటి బావూ నన్నెరగరేటీ తవరు, నాను బంగారమ్మని గానా, నా మొగోడు మీకాడ కవతవుండీవోడు గాడా, అప్పుడే మరిసిపోనారా" అంది బంగారమ్మ.

మండలాధ్యక్షుడి మనసప్పటికి కుదుటపడింది. కుర్చీలో రిలాక్స్‌గా సర్దుకుని చేరబడ్డాడు.

"అయితే ఏటంటావు?" అన్నాడు మొహం నిండా చిరాకు నింపుకుని.

"ఈ స్టవ్వులూ సిలిండర్లూ గట్టా డ్రాలో ఉన్నావోళ్లకే. ఎవ్వలకి బడితే అలకివ్వ డానిక్కాదు".

"అయ్‌బాబూ, నానా పొయ్యి కోసం రానేదు బాబూ. పొయ్యి మీద పొంగించుకునీ గింజల కోసం పట్టీలు కొడతన్నావోళ్లం, సోకు పొయ్యిలు మావేం జేసుకుంటాం. అలాగ గరువులమ్మట పడిపోతే దొరికే కంపా కర్రా సాలవేటి మా పొయ్యిల్లోకి" అంది.

"అయితే నడునడు, బైటికి నడు, నీ సమస్యలేవన్నా ఉంటే ఉంకో రోజు మాట్లాడుకుందాం" అన్నాడు.

'బావూ, ఎన్నాళ్లబట్టీ తిరుగుతున్నానో మీ ఆపీసు సుట్టూ నాకెరిక, ఆపైనున్నావోడి కెరిక. ఇన్నాళ్లకి లోపలకి దారి దొరికింది. ఎప్పుడూ గేటు కాణ్నుంచే తరివేత్తన్నారు. ఎర్రిముండని తవరిందులోకి మారేరని తెలక ఆ పాతాపీసు గేటుకాడకెల్లి కూకున్నానీ వోరం రోజుల బట్టీ. అక్కడ కిల్లీబడ్డీ ఎంకట్రావు సెప్తే ఇయ్యాళ తెల్సింది ఇదిక్కడెట్టేరని. ఎంటనే లగెత్తుకొచ్చేను".

లోపలి గదిలో రెస్ట్ తీసుకుంటున్న జె.సి. గారికి ఈ సోదంతా వినపడుతుందేమోనని అక్కడున్న వాళ్లందరికీ అసహనంగా ఉంది.

"వాటీజిట్ బ్రదర్, సెండ్ హర్ క్విక్లీ" అన్నాడు ఎమ్మార్వో.

"అయ్‌గారూ! నా గోడంతా మీరినాల" అంది బంగారమ్మ చేతులు జోడించి లోపలి గుమ్మం వైపు చూస్తూ.

అందరూ ఉలిక్కిపడి అటు చూద్దురుకదా, ఎప్పుడు లేచొచ్చేడో ఏమో అసిస్టెంటు కలెక్టరు గారు గుమ్మానికానుకుని ఆమెను చూసి చిర్నవ్వుతో తల పంకిస్తున్నాడు.

చటుక్కున కుర్చీల్లోని వాళ్లంతా లేచి నిల్చున్నారు.

జె.సి. ఈ రాష్ట్రం వాడు కాకపోయినా చక్కని తెలుగు మాట్లాడగలడు. ఎదుటివాళ్లు మాట్లాడితే అర్థం చేసుకోగలడు. చిన్న వయసులోనే డైరెక్ట్‌గా జాబ్‌లో జాయినైపోయాడేమో ఇంకా జనాల లౌక్యాలు, మోసాలు వంటబట్టలేదు. మొహమ్మీద చిరునవ్వుని ఎప్పుడూ కాపాడుకుంటూ ఫ్రెష్‌గా విరిసిన విరిలాగ కనిపిస్తాడు. అతని మొహాన్ని చూసిన వాళ్లెవరికైనా తమ ఆత్మీయుణ్ణి చూసిన భావం కలుగుతుంది. ఆయన తాపీగా నడిచొచ్చి టేబుల్ వెనక కుర్చీలో కూర్చున్నాడు.

బంగారమ్మని టేబుల్ దగ్గరికి రమ్మని చేతితో సైగ చేశాడు. బంగారమ్మ టేబుల్ దగ్గరికి నడిచింది.

ఎదుటి బెంచీని చూపించి కూర్చోమని సైగ చేశాడు. బంగారమ్మ కూర్చోలేదు. కుర్చీల్లోని వాళ్లంతా లేచి నిలబడ్డం చూసి 'ఈయనెవరో ఈళ్లందరికన్నా పెద్దాపీసరు' అని అర్థమైందామెకి.

"కూర్చో" అన్నాడు మళ్లీ.

"వొద్దండి బాబయ్యా, నేనిలాగ నిలబడి నా గోడు సెప్పుకొంటాను, తవరినాల".

"సరి, చెప్పు" అన్నాడాయన.

బంగారమ్మ ఎక్కణ్ణుంచి మొదలెట్టాలా అని ఓ క్షణం ఆలోచించింది.

ఆమె సమస్య అర్థమైన వాడిలా "నీ పేరేంటో చెప్పు ముందు" అన్నాడాయన.

"బంగారమ్మంటారండి. లా ఇజీనగరం కేసెల్లి సివ్వాసెలం వత్తంటే గరువు వలస కాడ బంగారమ్మ తల్లి గుడినేదా? అక్కడే మా యూరు. నాకా పేరే ఎట్టేడు మాయయ్య. నానింత గుంటగా ఉన్నప్పుడే ఇటుకేసి పారొచ్చినాం" అని అరచేతిని మోకాలి కిందికి దించి అప్పటికి తనెంతుండేదో చూపించింది.

ఎమ్మార్వో గుమస్తా కోసం అటూ ఇటూ చూసి అతను కనపడక టేబుల్ మీదున్న పెన్ను తీసి ఆమె పేరునోట్ చేసుకున్నాడు.

"వయసు" అన్నాడు ఎమ్మార్వో అనాలోచితంగా.

"ఎవుర్ది?" తిరిగి ప్రశ్నించింది బంగారమ్మ.

ఎమ్మార్వో మొహంలోకి చికాకు తన్నుకొచ్చింది. జె.సి. గారి మొహంలోని చిర్నవ్వుని చూసి బలవంతంగా తనూ నవ్వు తెచ్చుకోడానికి ప్రయత్నిస్తూ "ఇంకెవర్ది, నీదే" అన్నాడు.

"ఉ ఊ.... నాకేటెరిక? నాలుగు పుస్కరాల కిందట మాయయ్య గోదారి పుస్కరాలు సూడాలని ఇంటందర్నీ తోలుకొని ఇటుకేసొచ్చేడంట. వొచ్చీతలికి ఏటైనాదీ... ఇటు కేసి బూవులన్నీ పచ్చగా పసిమించిపోతా తల్లిమాలచ్చిమి అంపడినాదంట. ఇంకేటున్నాది, మాయయ్యకి ఇటుకెల్లి అరటితోటలు, సెరుకుతోటలు, వొరిసేలు సూస్తే కడుపు నిండిపోనాదంట. అంతే, ఆడి పుర్రిలోకి ఒక బుద్ధి పుట్టిందంటే ఇంకెవరి మాటా ఇంటం లేదింక. లెగండి లెగండని ఇంటందర్నీ తోలుకుని ఉన్నాకాడికి సేనూసెక్కా అమ్ముకుని ఇటుకెల్లి వొచ్చీసేడు. నానంటే తూర్పుకెల్లి పుట్టేను గాని, నాకిద్దరు తమ్ముళ్లు, ఇద్దరు సెల్లెళ్లు ఇటుకెల్లే పుట్టేరు" గుక్క తిప్పుకోడానికి ఆగింది బంగారమ్మ.

ఈ సొదంతా ఏంటని ఎమ్మార్వో మొహం విసుగ్గా పెట్టబోయి మానుకున్నాడు. జె.సి. చాలా ఇంట్రస్టుగా వింటున్నాడు.

"అసలు మా అయ్యొచ్చి గోదారి కాలవల కింద లంక బూవుల్లో దిగేడంట. అప్పుడికి నాకంత గెవనం లేదు. తర్వాత్తర్వాత ఈ కతంతా ఆడు జెప్పుకొచ్చీవోడు. అక్కడ మడిసెక్క కొనాలంటే ఆడొల్లకాదని తేలిపోనాదంట. కాలవ కింద బూవంటే మాటలేటీ మరి! అక్కడికీ రెండు మూడు సమత్సరాలు అక్కడే ఉన్నాడు. మా పెద్ద తమ్ముడు లేడా, ఆడక్కడ పుట్టినోడే. ఓ పాలేట్టైందంటే కావందు గారు ఇటుకేసి అడివిలకెల్లి సింతపండట్రామని డబ్బులిచ్చి సైకిలిచ్చి పంపేడంట. మాయయ్యేం జేసేడు, ఇలాగ ఏలేశరం మీద నించి సైకిలు తొక్కుకుంటా తొక్కుకుంటా అడ్డతీగిలి అడివిలికెసెల్లి పోనాడంట. అక్కడ మంచి గుంజు సింతపండు దొరికినాదంట. మాయయ్యసలే తెలివైనోడు గందా పదీశెలట్రా మంటే ఈడు ఉంకో పదీశెలట్టుకెళ్లేడంట. ఓ... జనవంతా ఎగబడి ఒక్క రోజులో కొనేసేరంట. అది మొదలు, ఆడికీ యాపారవేదో బాగానే ఉన్నట్టు తోసింది. ఇంకేటుంది, సైకిలుకు కట్టుకుని సింతపండు తేటం, అమ్మటం, మంచి లాబసాటి యాపారమైంది. ఏదో నాలుగు రాళ్లు ఎనకేసుకునీ ఏలకి జనం గోస ఎక్కువైపోనాది. ఈడేటీడు, ఇక్కడోడూ కాదు, ఒకలోకవూ కాదు, ఎక్కణ్ణించో వొచ్చి మనకాడ సింతపండు అమ్మి పెద్దోడైపోతన్నాడు అన్న ఆలోసనొచ్చి ఊళ్లో ఉంకో నలుగురు సింతపండు బేరగాళ్లు బయలెల్లేరంట. మా అయ్యకి మంచి సిరాకొచ్చీసింది. అంతే గందా, ఒకడు సేసే యాపారంలోకి నలుగురు దూరిపోతే నాబాలు పలసబారిపోవా? ఇంక ఇదిగాదు పనని నత్తానావా కుటంబాన్నేసుకుని ఇటుకేసి ఏలేరుకింద లక్కోరం వొచ్చీసేడు. ఇక్కడికి ఇటు అడవి తల్లీ దగ్గిరే, అటు కొనీ వూళ్లూ దగ్గిరే.

తెల్లారి మేదరోళ్లు నేసిన గాబు తట్ట నిండిక్కీ సింతపండట్టుకుని అటు రాజమండ్రానికో, ఇటు కాకినేడకో ఎలిపోతే పొద్దుగూకే ఏళకి ఒక్క పిక్కలేకుండా అమ్ముకొచ్చీసీవోడు. డబ్బులు కూడినప్పుడల్లా అరెకరం అరెకరం సొప్పుని మడిసెక్కలు కొనీవోడు. ఆడికి బూంమీద ఆపేచ్చ మాలావు.

ఇక్కడే మా సెల్లెల్లిద్దరూ, మా సిన్న తమ్ముడూ పుట్టేరు. సరే, మావందరం పెరిగి పెద్దోళ్లయ్యేం. పెళ్ళిళ్లూ పేరంటాలూ సేసి ఒక్కొక్కళ్లకీ ఆడోళ్లూ మొగోళ్లూ అనకుండా అరెకరం అరెకరం సొప్పుని పంచి పెట్టీసేడు. ఏదో దేవుడి దయవల్ల అందరం పిల్లా జెల్లాతో కలకల్లాడతా ఉండి కూలికోనాలికో ఎల్లి కుంచెడూ మానెడూ మడిసెక్కలు కొనుక్కుని కూడేసుకున్నాం. ఏలేరు తల్లి పున్నెవాని కడుపునిండా బువ్వ, కంటి నిండా నిదరా... అయిమని ఉండీవోళ్లం. కన్న రుణానికి ముసిలోళ్ళి కట్టపడనీకుండా కూకోబెట్టి కూడెట్టీవోళ్లం".

ఉన్నట్టుండి బైటంతా కలకలం చెలరేగింది. రెండు మూడు కార్లొచ్చి ఆగేయి. రంగుచొక్కాల వాళ్లంతా కారుల్లోంచి బిలబిలమని లోపలికి దండులాగ తోసుకొచ్చేరు.

"ఎనకాల కార్లో ఎమ్మెల్యే గారొచ్చేత్తన్నారు" అన్నాడొకడు.

"ప్లీజ్, వాళ్లందర్నీ బైట కూర్చోమని చెప్పండి" అన్నాడు. జె.సి.గారు ఎమ్డీవో వైపు తిరిగి. ఆయన అతి ఇబ్బందిగా మొహం పెట్టి ఆ పనిమీద లేచి వెళ్లేడు. కరవమంటే కప్పకి కోపం, విడవమంటే పాముకి కోపం మరి.

తర్వాతేం జరిగిందో చెప్పమన్నట్టుగా బంగారమ్మ వైపు చూసేడాయన. బంగారమ్మ వెంటనే అందుకుంది.

"అలాగ అయిగా గడిసిపోతన్న రోజుల్లోనండి ఏ పాపిష్టికళ్లు పడ్డాయో గానీ పడ్డాయండి. అక్కడికీ గండిపోసమ్మకీ, లోవ తలుపులమ్మకీ, అన్నోరం సత్తిన్నారాయణ మూర్తికీ ఏవీ లోటు జేసీ వోళ్లం కాదండి. ఆ మాటికొత్తే మా సివ్వాసెలం అప్పన్నబాబునే కొంత లచ్చిపెట్టేవోళ్లం కాదండి. ఏటంటే, మనవెక్కడుంటే అక్కడే మననేల, మన గూడూ గుడుసూలాగ మన దేవుడూ దెయ్యవూ కూడానని నమ్మినోళ్లవండి. ఏం సెప్తున్నానండి? ఆ.. అక్కడి దాకా బాగానేనడిసిపోయిందండి బండి. ఉన్నట్టుండి ఏలేరు మీద డేము కడతన్నారన్నారండి. బాబూ, ఆపైనున్నావోడి సాచ్చిగా సెప్తున్నానండి. డేమంటే మాకర్ధం అవలేదండి. ఏది కడితే మనకేటి, మనకీ పని దొరుకుతాది, తిండికి లోటు కలక్కుండా ఏదో బతుకెల్లిపోతాది అనుకున్నావండి. బాబయ్యా, నాకు నిజం మీ కబద్దవూనండి, అదేగాని కడితే కాని కాలం వొచ్చి కట్టకింద ఊళ్లన్నీ మునిగిపోతాయన్నారండి. ఇంక లక్కోరవెంతండి?

ఇదేట్రా బగమంతుడా ఇంత అగులెట్టేవు అని మా ముసిలోడు అల్లిపోయి మంచవెక్కేసేడండి. అక్కడికీ మేవందరం దైర్నం సెప్పి సూసేవండి. నా మట్టుకి నేను "ఏట్రా అయ్యా, నీకేవన్నా పిచ్చేటి అలాగ ఇదైపోతన్నావు, గవర్మెంటోరి కేవన్నా మనమీద కచ్చా కార్పన్యవా? మనకాడ గుడిసీ గూడూ సేనూసెక్కా లాక్కుని ఆరేం జేసుకుంటారు? కాదూ కూడదూ మునిగిపోతాయంటావా, మునిగిపోతే మునిగిపోనీ, నలుగురితో నారాయణా కులంతో గోయిందా. అందరికీ లేని అగులు మనకేల? ఏది శాశివేతం? తూరుపుని నువ్వు పుట్టిన ఊరినే వొదులుకునొచ్చినోడివి, నీకీ నేల మీద ఇంత మమకారమేలా" అని ఏదో ఆడి గుండి దైర్నానికి ఏదాంతం మాట్లాడతా ఉండీదాన్ని. ఎంత సెప్పినా ఆడు గుండిరాయి సేసుకోలేకపోయేడు. కట్టకిందకి నీళ్లొచ్చి ఊళ్లు మునిగిపోటం సూడకుండానే ఆడి గుండి నీరైపోయింది. ఆణ్నక్కడే గుప్పెడు బూడిది సేసేసి, మా గుండెలు నిబ్బరం జేసుకుని బయలెల్లి వొచ్చినాం. ఇదిగో మమ్మల్నిలాగ ఈ మెట్టనేలల్లోకి ఇసిరిపడేసేరు. ఈ అయిదో నెంబరు

పెద్దరోడ్డు పక్కని ఒక్కొక్కళ్లకీ సెంటున్నర జాగా ఇచ్చి ఇసకా, ఇటిక, సున్నం ఆరే అప్పిచ్చి ఇళ్లు కట్టుకోమన్నారు. సచ్చీ సెడీ తలమీదకి ఒక నీడ ఏరుపాటు సేసుకుని బతుకుజీవుడా అనుకున్నాం. పచ్చని అడివీ, సల్లని ఏరూ నించి ఇడదీసి తెచ్చి మమ్మల్ని ఈ మెరక నేల మీద పడేసేరు. వానొత్తేగాని గరికన్నా మొలకెత్తన్నేల ఇది. ఏ కూలికో నాలికో పోదారంటే పన్లెక్కడున్నాయి?" బంగారమ్మ ఆగి ఊపిరి పీల్చుకుంది.

టేబులు మీద అంతకుముందే జవాను తెచ్చిపెట్టిన నీళ్లగ్లాసుని తీసి ఆమెకందించాడు జె.సి.

ఆమె గడగడా తాగెయ్యడం చూసి మరో గ్లాసు తెప్పించి ఇచ్చేడు. పైన ఫేను తిరుగుతున్నా గతాన్ని తవ్వుకుని ఉద్రేకపడడం వల్ల ఆమె తలలోంచి చెంపల మీదుగా చెమట ధార కట్టింది. జాకెట్టు తడిసి ముద్దయింది. బొడ్లో దోపిన పైట చెంగుని తీసి విదిలించి దులిపి మొహం తుడుచుకుంది బంగారమ్మ.

ఆమె ఏం చెప్పదల్చుకుందో జె.సి.కి కొంత అవగతమైంది.

"నీళ్ల భూములకి కాంపన్సేషను ఇవ్వలేదా?" అని ఇంగ్లీషులో ఎమ్మార్వోని అడిగాడు.

"ఇచ్చేసేం సార్, ఎప్పుడో".

"ఏమమ్మా, నీ మడిచెక్కకి నీకు డబ్బు ముట్టిందా?"

"ఆ ముట్టింది బావూ, ఈ నేల తల్లి మీద నిలబడి నాను అసద్దవాడను. మేవడిగినంతా ఇవ్వలేదు గానీ ఆరు ఇవ్వాలనుకున్నంతా ఇచ్చేరు. ఆ డబ్బుల్తోనే రోడ్డు పక్కన కాపీ ఒటేళ్లూ, కిళ్లీబడ్డీలూ ఎట్టుకున్నాం".

"మరింకేమిటి మీ ప్రోబ్లం?"

"ఆగండి బావూ, నాగోడూ గోసా ఇంకా అయిపోనేదు. అసలు కర్మవంతా ఉప్పుడే బద్దలైంది. బూవికోసం నా అయ్య ఎందుకంత బెంగటిల్లిపోయేడో నాకుప్పుడర్దవౌతంది. మనిసికి సొంతం, నాది అన్నమాట బతుక్కి గొప్ప దైర్నాన్నిత్తాది. ఎక్కడా నిలబడ్డానికి జాగా లేక, నీదనుకున్నదేదీ నీది కాదంటే నీకైనా ఎలాగుంటాదో ఆలోసించు బావూ! ఊరు మారించోట కట్టెలమ్ముకున్నా ఎవరికి తెలుత్తాదిలే అని ఏదో బతుకుబండిని లాగించుకొత్తంటే పులి మీద పుట్రలాగ ఈ రోడ్లొచ్చేయి. రోడ్లు ఎడల్పు చేత్తన్నాం, అందరూ కాళీ సేసేసి పొండని రేత్రికి రేత్రి ఇళ్లన్నీ కూల గొట్టేసి మమ్మల్ని రోడ్డు మీద నిలబెట్టేసేరు. అప్పుడందరం లబోదిబోమని ఇదిగో మీ పక్కన కూకుని రాత్తన్నాడే ఆ బాబుకాడికే లగెత్తుకొచ్చేం. "కొన్నాళ్లు ఆగండి డబ్బులిత్తాం, ఇంకెక్కడైనా కొనుక్కుని కట్టుకుందురు గాని" అన్నాడీ బాబు. ముక్కుంది మొకవుంది మనిసి ఎదురుగా ఉన్నాడు. అన్నాడో లేదో అడగండి. ఏటి బావూ,

డబ్బే పెపంచకవేటి? కాళ్ల కింద నేలని గూడా లాగేసుకుని డబ్బులిచ్చేత్తాంలే అంటే మేవే దిక్కుకి తిరిగి గొల్లుమనాల? ఇయ్యాళ గేసుపొయ్యిలిత్తన్నారు. అయన్నీ మీలాటోళ్లకి గానీ మాకెందుకు బావూ? పొయ్యిమీదకున్నాక గందా పొయ్యి కిందకెన్ని సోకులు జేసినాను! ఏదో నాలుగు డబ్బులొత్తాయి అనుకుంటే కొనేవాళ్లే లేక పోయె".

జె.సి.గారి మొహంలో చిరునవ్వు మాయమైంది. ఆమెకేం జవాబుచెప్పాలో తెలీని ఒక అసహనమో, నిస్సహాయతో చోటు చేసుకుంది.

"మీరేం వర్రీ కాకండి సార్, ఆ ఇళ్లకి కూడా వీళ్లకి కాంపన్సేషను ముట్టేసింది. ఎంత తిన్నా వీళ్లిలా పేదరుపులు అరుస్తానే ఉంటారు సార్. గవర్నమెంటంటే బాగా లోకువైపోయింది. అడ్డమాలినవాళ్లా ఆఫీసుల్లోకొచ్చి ఇష్టమొచ్చినట్టు వాగడమే" అన్నాడు ఎమ్మార్వో.

"మిస్టర్ రాజు బాబూ!" గట్టిగా వారించాడు జె.సి.

"బాధ్యత గల జాబ్‌లో ఉండి వాళ్లకి సహాయం అందించాల్సిన మనమే అలా మాట్లాడితే ఎలా? వాళ్ల అవసరాలేమిటో కనుక్కొని సహాయం అందించడానికే మనం ఉన్నదిక్కడ. వాళ్లకి ఎనిమీస్‌లాగా మాట్లాడితే ఎలా? ఏమ్మా, నీ ఇంటికి ఎంత డబ్బిచ్చారు నష్టపరిహారంగా?"

"పది ఏలండి".

"మిస్టర్ రాజుబాబూ, ఇంతే కొలతలున్న రాజకీయ కార్యకర్త డాబా ఇంటికి పది లక్షలు ఇచ్చినట్టు రాసారిక్కడ. ఎక్కడి పది లక్షలు, ఎక్కడి పదివేలు?"

రాజుబాబు వెంటనే తడుంకోకుండా సమాధానం చెప్పేడు. "అదేంటి సార్! అది మార్బుల్ ఫ్లోరింగ్‌తో ఎంతో రిచ్‌గా కట్టిన బిల్డింగు. ఇవేమో డ్రెడ్జరుతో ఇలా తొయ్యగానే కూలిపోయిన ఒంటిటిక ఇళ్లు. దానికీ ఈటికీ సాపత్యమెక్కడ సార్! అదీగాక మీకు తెలీందేం ఉందండి. అసలు శాంక్షనయ్యే చోటికే వెళ్లి పన్లు చేయించుకునే రాజకీయ నాయకులకీ ఈళ్లకీ పోలికేంటి సార్! వీళ్లు ఆ పదివేలైనా నిలుపుకొన్నారేమో అడగండి".

"ఏమమ్మా?".

"అది సెప్పాలనే బాబూ నేనిదంతా ఏకరువెట్టుకొచ్చేను. మీరు పది ఏలివ్వటం నిజవే. ఆటిని నా కొడుకులు ఉప్పుటేట్లో సేపలేపారం జేసి డబ్బు గడిత్తావని అట్టుకెళ్లి ఆరిపెయ్యడం నిజవే. నేనుప్పుడేం సెయ్యాలో నాయం మీరే సెప్పండి. తూరుపున జొన్నలు, గంట్లు పండే అయిదెకరాల నేల ఏలేటి కింద ఎకరం నేలగా మారినప్పుడూ మాకు బాదకలగలేదు. పదిమంది రెక్కలు సల్లగుంటే సాలనుకున్నాం. ఏటి పక్కనించి రోడ్డు పక్కకీ, రోడ్డు పక్క నించి ఉప్పుటేట్లోకి నడిసిపోయిన మా బతుకుల్లో ఈ మార్పు

ఎందుకొచ్చిందో సెప్పాల మీరు. ఉప్పుడు మా బతుకు తెరువెలాగో, మా తలల మీదకి నీడ ఎక్కడ దొరుకుతాదో సెప్పాల మీరు".

ఇంక ఓపిక అయిపోయినట్టు చటుక్కున బల్లమీద చతికిలపడింది బంగారమ్మ. తిరిగి ఓపిక కూడదీసుకుని చూపుడు వేలు పైకెత్తి "మీరు ఆ మర్మం ఏటో ఇప్పి సెప్తే గాని నేనిక్కణ్ణించి కదల్ను" కాళ్లపైకి లాక్కుని బాసిం పట్టు వేసుకుని వెనక్కి చేరబడి విశ్రాంతిగా కూర్చుంది బంగారమ్మ.

అప్పటి వరకూ మామూలుగా మాట్లాడిన ఆమె మొహంలో ఓ చిత్రమైన మార్పేదో చొరబడినట్టు అనిపించింది జె.సి.కి.

బైట టపాసులు పేలుస్తున్నారు.

"ఎమ్మెల్యే...గారికీ జై" అని అరుస్తున్నారు ఆడామగా అంతా. రయ్యిమంటూ వచ్చి ఆగిన ఎమ్మెల్యే కారుడోరు తీసి పట్టుకుని వంగివంగి శాల్యూట్ చేస్తున్నాడు పెద్ద కేడర్లో ఉన్న పోలీసు ఆఫీసరొకాయన.

"రండి సార్, బైట కార్యక్రమానికి ఆలీసెమైపోతుంది. మీకు తెలీదుగాని సార్ ఈమెకీ మధ్య పిచ్చి పట్టింది. అందరి దగ్గరా ఇలాగే వాగుతుందట సార్" అన్నాడు అప్పుడే బైటి నుంచి వచ్చిన ఎమ్డీవో.

జె.సి.కి ఆశ్చర్యమనిపించింది. అప్పటి వరకూ ఆమె మాట్లాడిన మాటల్లో అసంగతమైనదేదీ లేదు. ఈమెకి పిచ్చేమిటి?

"నా మాట నమ్మకపోతే ఇప్పటిదాకా నిలబడి మర్యాద పాటించిన మనిషి ఇప్పుడెలా కూచుందో చూడండి సార్. ఆ మొహంలో మార్పు చూడండి సార్".

"ఎమ్మెల్యే గారికి ఉంకోచోట ప్రారంభోత్సవం ఉందంట. తొరగా రమ్మంటున్నారు" అంటూ వచ్చేడు ఓ రంగు చొక్కా వ్యక్తి.

జె.సి. లేచి వెళ్తూ బంగారమ్మ వైపు జాలిగా చూశాడు. ఆమె ఎక్కడో చూసుకుంటూ తనలో తను నవ్వుకుంటోంది.

"పద పద, బైటికి నడు" అదిలించేడు బంట్రోతు.

"బావూ, నీ కాళ్లకిందున్న నేల నీదికాదు. నీ ఉజ్జోగం నీది కాదు జాగర్త" అని అరిచింది బంగారమ్మ.

(ఆర్.ఎస్. కృష్ణమూర్తి స్మారక అవార్డ్ పొందిన కథ)

ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక, 6.1.2005